

భజే..భజే.. భక్తాభీష్టా..
పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీ నరసింహస్వామివారి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ జరగనుంది. ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. -10లో..



దగా.. మో...సం!
ముగ్గురు కిలేడీలు వివాహం పేరుతో ఓ యువకుడిని మోసం చేశారు. మ్యారేజ్ బ్యూరో పేరుతో రూ.3 లక్షలు కమీషన్ ఇవ్వాలని చెప్పి రూ.లక్ష స్వాహా చేశారు. -10లో..

గరిష్టం/కనిష్టం
40 /29

వాతావరణం
పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వందేభారత్ రైలుపై రాళ్ల దాడి

ఒంగోలు టౌన్: వందేభారత్ రైలుపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేయడం కలకలం సృష్టించింది. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న వందేభారత్ రైలు గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో ఒంగోలు సమీపంలోకి రాగానే సూరారెడ్డిపాలెం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో సీ5, సీ11 కోచ్‌ల అద్దాలు పగిలినట్లు తెలిసింది. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఆర్‌పీఎఫ్ రంగంలోకి దిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హనుమంతునిపై శ్రీవారి వైభవం



ఒంగోలు మెట్రో: శ్రీగిరి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో గురువారం సాయంత్రం శ్రీవారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత దేవస్థానం ధర్మకర్తలు, భక్తులు స్వర్ణ ఖడ్గాన్ని సమర్పించి స్వామివారి పట్ల భక్తిభావాన్ని చాటుకున్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతా రామాచార్యులు బృందం ఆధ్వర్యంలో ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా భక్త ప్రహ్లాద చరిత్రపై ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు శ్రీనివాసులు ఉపన్యసించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీపీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, కుమార ఆత్రేయ, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాసచరణ్‌రాజీవ్, ఆలూరు జై శంకర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఓటమి పెత్తనం.. అధికారులు గులాం!

కూటమి ప్రభుత్వంలో ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలకు ప్రత్యేక రాజ్యాంగం అమలవుతోంది. జిల్లాలో దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో పేరుకే వారు ఎమ్మెల్యేలు.. అక్కడ పెత్తనమంతా అధికార పార్టీ నాయకులదే. ప్రభుత్వం మాది.. పెత్తనమూ మాదే అన్న విధంగా ఆ నియోజకవర్గాల్లో పరిస్థితులు నెలకొన్నాయి. కనీసం వార్డు సభ్యులు కూడా కాని వారికి అధికార యంత్రాంగం జీ హుజూర్ అంటోంది. కనీస ప్రొటోకాల్ అమలు విషయంలో కూడా వివక్ష కనిపిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారికంగా జరిగే జిల్లా స్థాయి సమీక్షల్లో కూడా వారికి రాచమర్యాదలు సాగుతున్నాయి. ప్రజల మద్దతుతో గెలిచిన వారిని కాదని వీరికి పెద్ద పీట వేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ప్రత్యేక రాజ్యాంగం
- రెండు చోట్లా వైఎస్సార్ సీపీ గెలిస్తే పెత్తనం మాత్రం టీడీపీ నేతలదే
- దర్శిలో ప్రభుత్వాధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి
- యర్రగొండపాలెంలో టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు మాటే వేదం
- జిల్లా స్థాయి అధికారిక సమావేశాల్లోనూ వారికి రాచమర్యాదలు
- పోలీసు ఎస్కార్ట్‌తో దర్జా ఒలకబోస్తున్న టీడీపీ నేతలు
- ఇన్‌చార్జిలకు సలాం చేస్తున్న అధికారులు



గత నెల 12వతేదీ ఒంగోలులో జరిగిన డీఆర్‌సీ సమావేశంలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్ బాబు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: గత సార్వత్రిక ఎన్నికలలో జిల్లాలో దర్శి, యర్రగొండపాలెంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్ విజయం సాధించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ నియోజకవర్గాల నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందిన అభ్యర్థులు నేడు పెత్తనం చలాయిస్తున్నారు. రాజ్యాంగేతర శక్తుల్లా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసు ఎస్కార్ట్‌తో నియోజకవర్గంలో తిరుగుతున్నారు. ప్రభుత్వ కార్యకలాపాలలో అధికారికంగా పాల్గొంటున్నారు. రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ ఇన్‌చార్జిల తీరుపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ అటు పాలకులు, ఇటు అధికారులకు ఏమాత్రం చీమకుట్టినట్టయినా లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యర్రగొండపాలెంలో ఎరిక్షన్‌దే పెత్తనం...

యర్రగొండపాలెం ఎమ్మెల్యేగా తాటిపర్తి చంద్రశేఖర్‌ను ప్రజలు గెలిపించుకున్నారు. అయితే, దొడ్డిదారిన టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు అధికారం చలాయిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల నియోజకవర్గంలో రైతులకు పనిముట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే చేతుల మీదుగా జరగాలి. కానీ, అందుకు విరుద్ధంగా గత ఎన్నికలలో ఓడిపోయిన అభ్యర్థిచేత పంపిణీ చేయించడంతో ప్రజలు విస్తుపోయారు. యోగా సన్నాహక కార్యక్రమంలో కూడా ఇదే పునరావృతమైంది. జిల్లా అధికారులు హాజరైన ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేకు కనీసం ఆహ్వానం కూడా లేదంటే కూటమి పాలకుల తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని ప్రజాస్వామికవాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే తాటిపర్తి అధికారికంగా ఏదైనా కార్యక్రమం, సమీక్షగానీ నిర్వహిస్తే సంబంధిత శాఖ అధికారులు మొహం చాటేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యర్రగొండపాలెంలో ఇదే దుస్సంప్రదాయం కొనసాగుతోంది. నియోజకవర్గంలో ఒక సర్పంచ్‌గా కూడా ఎన్నిక కాని వ్యక్తి అంతా తానే అయినట్లు అధికారం చలాయించడం, పోలీసు ఎస్కార్ట్‌తో ప్రజల మధ్య తిరగడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లా సమావేశాలలో కూడా అదే తీరు..

ఆ మధ్య నాటుసారాకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం నవోదయం అనే ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఒంగోలు జిల్లా పోలీసు కార్యాయలంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర హాజరైన ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలను ఆహ్వానించారు. అయితే వేదిక మీద ఎమ్మెల్యేలతో పాటుగా దర్శి టీడీపీ ఇచ్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, యర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుకు కూడా సమానంగా కుర్చీలు కేటాయించారు. ఈ విషయం మీద అనేక విమర్శలు వచ్చాయి. అంతేగాకుండా ఇటీవల జరిగిన డీఆర్‌సీ మీటింగులో కూడా వీరిద్దరికీ కుర్చీలు కేటాయించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అయినా సరే నిబంధనలను ఉల్లంఘిస్తున్నామన్న భావన అధికారులలో ఏమాత్రం కనిపించడంలేదు. తమ పరిధికి మించి వ్యవహరిస్తున్నామన్న ఆలోచన నాయకులు చేయడం లేదని మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనధికార ఎమ్మెల్యే చుట్టూ...

గత ఎన్నికలలో ఓటమి పాలైన అభ్యర్థులకు జిల్లా అధికారులు జీ హుజూర్ అనడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దర్శి, యర్రగొండపాలెం అనధికార ఎమ్మెల్యేల చుట్టూ తిరగలేక అధికారులు పడరానిపాట్లు పడుతున్నారు. యర్రగొండపాలెంలో అయితే ఇన్‌చార్జి అవినీతిని కాపుకాయలేక చస్తున్నామని ఒక అధికారి వాపోవడం గమనార్హం. ప్రతిరోజూ ఉదయాన్నే మార్కాపురంలో నివాసం ఉంటే ఆయన్ను కలిసి నమస్కారం పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు గుడ్ మార్నింగ్ చెప్పకపోతే వేధింపులు తప్పడంలేదని వాపోయారు. దాంతో ఉద్యోగులంతా ఎమ్మెల్యే తాటిపర్తిని కాదని అనధికార ఎమ్మెల్యే చుట్టూ తిరగడం తప్పడంలేదని చెబుతున్నారు. ఎమ్మెల్యేల కంటే టీడీపీ ఇన్‌చార్జిల పెత్తనం ఎక్కువైపోయిందని ఉద్యోగ సంఘాల నాయకులు కామెంట్ చేస్తున్నారు. దర్శిలో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. అక్కడ మేడం గారితో పాటు సార్‌ను కూడా గౌరవించుకోక తప్పడంలేదన్న ప్రచారం జరుగుతోంది. మేడమ్ తీరు పట్ల ఉద్యోగులలో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

దర్శిలో లక్ష్మి దర్పం..

ఆమె ఎమ్మెల్యే కాదు. పోనీ మండలాధ్యక్షురాలా అంటే అదీ కాదు. సర్పంచ్ కూడా కాదు. చివరకు గ్రామ వార్డు మెంబర్‌గా కూడా గెలవలేదు. ఆమె గత ఎన్నికలలో పోటీ చేసి ఓటమిపాలైన ఒక అభ్యర్థి మాత్రమే. అయినా సరే దర్శి నియోజకవర్గంలో ఆమెదే పెత్తనం. ఎన్నికలలో ఓటమి పాలైన మొదటి నెలలోనే దర్శిలోని ఒక ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీకి వెళ్లారు. ఏకంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ కుర్చీలో కూర్చుని ఫైళ్లను పరిశీలించారు. అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారంపై ప్రజలు ముక్కుమీద వేలేసుకున్నారు. అయినా సరే ఆమెకు పట్టలేదు. ఇప్పటికీ అదే ధోరణి కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులపై పెత్తనం చలాయిస్తున్నారు. అధికారులను ఇంటి వద్దకు పిలిపించుకుని ఎమ్మెల్యేలా సమీక్షలు చేస్తున్నారు. సీఐలు, ఎస్సైల ఎస్కార్ట్ లేకుండా ఇంటి నుంచి బయటకు ఆమె అడుగు పెట్టడం లేదంటే ఎంతగా అధికారం చలాయిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. నియోజకవర్గంలో విమర్శలు వెల్లువెత్తుతున్నా అధికార యంత్రాంగం మాత్రం ఆమె ముందు సాగిలపడడం సరికాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.



దర్శి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ కుర్చీలో కూర్చున్న గొట్టిపాటి (ఫైల్)

నేటి నుంచి డీఎస్సీ

- 729 పోస్టులకు 24,659 మంది అభ్యర్థులు
- ఎనిమిది కేంద్రాల్లో రెండు షిఫ్టుల్లో నిర్వహణ
- ప్రకాశం భవన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్
- పకడ్బందీగా పరీక్షలు : కలెక్టర్ తమీమ్ అన్సారియా





లైజనింగ్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ/ఒంగోలు సబర్బన్:

టీచర్ల ఉద్యోగాల కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రెండు షిఫ్టుల్లో జరిగే ఈ పరీక్షలు ఈ నెల 30వ తేదీ వరకూ జరుగుతాయి. ఉదయం 9:30 నుంచి 12:00 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2:30 నుంచి 5:00 గంటల వరకు రెండో సెషన్ జరుగుతుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో 629 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నారు. 24,659 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఇందులో మొదటి సెషన్‌కు 12,939 మంది, రెండో సెషన్‌లో 10,968 మంది, 24వ తేదీ నిర్వహించే మోడల్ స్కూలుకు సంబంధించి నిర్వహించే ఇంగ్లిష్ పరీక్షకు 752 మంది హాజరవుతున్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎనిమిది మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్టు డీఈఓ ఏ అరుణ్‌కుమార్ తెలిపారు.

పకడ్బందీగా పరీక్షలు...

జిల్లాలో 2025 మెగా డీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఆ మేరకు స్థానిక ప్రకాశం భవన్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం డిపార్ట్‌మెంటల్ అండ్ పరీక్ష కేంద్రాల లైజనింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఈ కమాండ్ కంట్రోల్ రూంలో నలుగురు అధికారులు నిరంతరం విధులు నిర్వర్తిస్తారన్నారు. ఎస్‌కే మదార్ బీ (జూనియర్ అసిస్టెంట్, 9441991757), సీహెచ్ నవ్య (జూనియర్ అసిస్టెంట్, 8977690457), నవ్య రోహిణి (జూనియర్ అసిస్టెంట్, 7989416703), ఎస్.హర్షిణి (అనలిస్ట్, 7416109602)ని సంప్రదించాలన్నారు. రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఒంగోలులో ఆరు కేంద్రాలు, మార్కాపురంలో రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒంగోలులో పేస్ ఇంజినీరింగ్ కాలేజీ, రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలలో రెండు సెంటర్లు, క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ, నేషనల్ కౌన్సిల్ ఫర్ ద చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియాలో, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో, మార్కాపురంలోని డాక్టర్ శామ్యూల్ జార్జ్ ఇంజినీరింగ్ కాలేజీలో, మార్కాపురం దేవరాజుగట్టు వద్ద ఉన్న కృష్ణచైతన్య ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి గంటా 30 నిమిషాలు ముందుగా పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. సెల్ ఫోన్లు, జామెంట్రీ బాక్సులు, బ్యాగులు, ఎలక్ట్రానిక్ డివైజ్‌లను అనుమతించమని తెలిపారు. సమావేశంలో డీఈఓ ఎ.కిరణ్ కుమార్, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- విద్యార్థులకు ఎస్పీ దామోదర్ పిలుపు



విద్యార్థులతో ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: చిన్నారులు చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ రాణించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండులో నిర్వహించిన చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంపు ముగింపు సభలో ఆయన మాట్లాడారు. విలువలతో కూడా విద్య బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చిన్నారులు క్రమశిక్షణతో మెలగాలని, నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు, గురువులు చెప్పే మాటలు వినాలని, వారి అనుభవాలను పాఠాలుగా అధ్యయనం చేయాలని సూచించారు. చిన్నారుల్లో నేర్చుకునే గుణం ఎక్కువగా ఉంటుందని, వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి మరింత మెరుగుపెట్టడమే ఉపాధ్యాయులు చేయాల్సిన విధి అని చెప్పారు. సమ్మర్ క్యాంపులో నిపుణులైన కోచ్ ద్వారా చిన్నారులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్, ఇతర క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి ఎస్పీ జ్ఞాపికలు అందజేశారు. క్యాంపు విజయవంతం కావడానికి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి పోలీసు చిల్డ్రన్స్ కమిటీ ప్రెసిడెంట్ రాజేంద్ర, వివిధ రంగాలకు చెందిన నేషనల్ క్రీడాకారులకు ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, క్రీడాకారులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. చిన్నారుల ఆటపాటలతో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా కొనసాగింది.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు సిటీ: స్థానిక పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం పొందే పరీక్ష రాసేందుకు వచ్చే నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సి.శివరాం సూచించారు. ఈ ఏడాది డిసెంబర్ 13వ తేదీ ఉదయం 11.15 నుంచి 1:00 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఒంగోలు, చీరాల, కందుకూరు, అద్దంకి, వేటపాలెం, గుడ్లూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు, లింగసముద్రం, సింగరాయకొండ, ఉలవపాడు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు, కొరిశపాడు, జె.పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చిన్నగంజాం వంటి 29 మండలాల నుంచి ప్రభుత్వ, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ముందుగా దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయునిచే వివరాలు ధ్రువీకరించి తిరిగి ఆన్‌లైన్‌లో మాత్రమే అప్‌లోడ్ చేయాలని చెప్పారు. విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరంలో 3వ తరగతి, 2024–25లో 4వ తరగతి, 2025–26లో 5వ తరగతిని ప్రభుత్వ, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉత్తీర్ణత పొంది ఉండాలని, 01-05-2014 నుంచి 31-07-2016 మధ్య జన్మించి ఉండాలని ప్రిన్సిపాల్ శివరాం వివరించారు.

ప్లాస్టిక్‌ను అరికడదాం..పర్యావరణాన్ని కాపాడదాం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య పిలుపు
- ఘనంగా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం



మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్

మద్దిపాడు: ప్లాస్టిక్‌ను అరికట్టి పర్యావరణాన్ని కాపాడుకుందామని కలెక్టర్ తమీమ్ అన్సారియా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద ఉన్న వినాయ స్వామి ఆలయం వద్ద ఏపీఐఐసీలోని పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కనే ఉన్న గ్రోత్ సెంటర్‌ను అత్యున్నతంగా తీర్చిదిద్దుకుని ఆదర్శంగా నిలపాలన్నారు. ఇక్కడ అనేక ఫ్యాక్టరీలున్నాయని వాటి ద్వారా వచ్చే పొల్యూషన్ తగ్గించడానికి విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించిందని, అందువలన ఎవరూ ఆ ప్లాస్టిక్ వాడరాదన్నారు. సదరు ప్లాస్టిక్ నీటిలో కరుగుతుందని, భూమిలో మాత్రం కరిగిపోయే పరిస్థితి లేదన్నారు. అటువంటి ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీరు తాగడం వలన రోగాలు వచ్చే ప్రమాదం కూడా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారుల వెంట ప్లాస్టిక్ విపరీతంగా ఉందని, అందువలన రహదారుల కాంట్రాక్టర్‌కు జిల్లా కలెక్టర్లు ఆదేశాలు జారీ చేసి ప్లాస్టిక్‌ను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అవసరమైతే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా వారిని ప్రాసిక్యూట్ చేయడానికి కూడా తాము వెనకాడమని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వనం–మనం కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లాలో 4 లక్షల 10 వేల మొక్కలు నాటామని, ఇది మంచి పరిణామమని అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిస్తే పర్యావరణ హితంగా ఆంధ్రప్రదేశ్ మారుతుందన్నారు.

నర్సరీలలో 35 లక్షల మొక్కల పెంపకం...

కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనం–మనం కార్యక్రమంలో భాగంగా 35 లక్షల మొక్కలను నర్సరీలలో పెంచుతున్నామని తెలిపారు. వాటిలో నీడనిచ్చే చెట్లు, పండ్ల మొక్కలు కూడా ఉన్నాయన్నారు. ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ల వారు ఎవరైనా అడిగితే వారికి ఉచితంగానే మొక్కలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రోడ్ల వెంట కూడా మొక్కలు నాటించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. మొక్కలు నాటి వదిలేయకుండా వాటిని సంరక్షించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. డీఆర్‌డీఏ ద్వారా మొక్కల సంరక్షణకు నిధులు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. అనంతరం దేవాలయ ఆవరణలో కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జోసఫ్‌కుమార్, ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, ఎంఆర్‌ఓ నారాయణరెడ్డి, ఎంపీడీఓ డీఎస్‌వీ ప్రసాద్, గ్రోత్ సెంటర్ గ్రానైట్ ఫ్యాక్టరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మండవ రత్నాకర్, దేవస్థానం కమిటీ సభ్యులు కొండా సర్వేశ్వరరావు, పెనుబోతు అజిత్, బోయిళ్ల శ్రీనివాసరావు, ఫ్యాక్టరీల యజమానులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

విజయవాడకు తరలి వెళ్లిన ఉద్యోగులు



విజయవాడ వెళ్తున్న ఉద్యోగులు

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లా నుంచి వందలాది మంది ఉద్యోగులు తరలి వెళ్లారు. గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ బందర్ రోడ్డులో జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వందల సంఖ్యలో ఉద్యోగులు వివిధ తాలూకాల నుంచి హాజరై సభను జయప్రదం చేశారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొంటున్న 14 ప్రధాన డిమాండ్లను నెరవేరే దానికి ప్రభుత్వానికి కొంత గడువు ఇస్తున్నామని, తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని ప్రకటించారు. జిల్లా కార్యదర్శి వరకుమార్, ట్రెజరర్ రంగారెడ్డి, సహాధ్యక్షుడు మసూద్, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఒంగోలు తాలూకా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి శ్రీదేవి, మార్కాపురం పట్టణ అధ్యక్షుడు చెంచిరెడ్డి, దర్శి తాలూకా అధ్యక్షుడు ఎన్‌వీ సుబ్బారెడ్డి, గిద్దలూరు తాలూకా అధ్యక్షుడు ఎస్వీ రంగయ్య, కంభం తాలూకా అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, ఎర్రగొండపాలెం తాలూకా అధ్యక్షుడు జానీబాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని వృద్ధుడు మృతి

దర్శి(కురిచేడు): వేగంగా వెళ్తున్న కారు ఢీకొనడంతో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన దర్శి మండలంలోని చలివేంద్ర కొండ వద్ద సమీపంలోని కాశీనాయన ఆశ్రమం వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. దర్శి మండలంలోని బండి వెలిగండ్ల గ్రామానికి చెందిన శ్రీపతి వెంకటేశ్వర్లు(60)కు నా అన్నవాళ్లు లేకపోవడంతో కాశీనాయన ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు. గురువారం సాయంత్రం ఆశ్రమం వద్ద రోడ్డు దాటుతున్న ఆయనను అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచ్‌పై దూషణ.. అట్రాసిటీ కేసు నమోదు

సింగరాయకొండ: సింగరాయకొండ మేజర్ పంచాయతీ సర్పంచ్ తాటిపర్తి వనజ ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిన అవినీతి పరురాలు, దొంగ అంటూ దూషించిన అయినాబత్తిన రాజేష్, సంగు వసంతయ్యపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. విలేకరుల సమావేశంలో తనపై అసత్య ఆరోపణలు చేశారంటూ సర్పంచ్ తాటిపర్తి వనజ జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కమిషన్ సూచనతో బుధవారం రాత్రి రాజేష్, వసంతయ్యపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. ఈ కేసును డీఎస్పీ స్థాయి అధికారి విచారిస్తారని చెప్పారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

● రూ.లక్ష ఆస్తి నష్టం

గిద్దలూరు రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన గిద్దలూరు మండలంలోని కొమ్మునూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సయ్యద్ ఖాశీంవలి ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ అయ్యాయి. ఫ్రిజ్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇళ్లు మొత్తం వ్యాపించడంతో సామగ్రి పూర్తిగా కాలిపోయింది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ప్రమాదం కారణంగా సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు చెప్పారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి



సీఎస్‌పురం(పామూరు): గుర్తు తెలియని సుమారు 70 ఏళ్ల వృద్ధుడు విగతజీవిగా పడి ఉన్న సంఘటన గురువారం పామూరు మండలంలోని ముళ్లపాడు సమీపంలో వెలుగుచూసింది. నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవే బ్రిడ్జి సమీపంలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఆనవాళ్లు గుర్తించినవారు 9121102216, 9121102214ను సంప్రదించాలని పామూరు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

పర్యావరణానికి ఓ మొక్క..



ప్రకాశం భవన్‌లో మొక్క నాటుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రకాశం భవన్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మొక్క నాటారు. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి పద్మశ్రీ, ఇతర శాఖల అధికారులతో కలిసి మొక్క నాటిన జేసీ.. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఒంగోలు డివిజన్ రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న మొక్కలు నాటారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఆటో

● ఆరుగురికి తీవ్ర గాయాలు

మార్కాపురం: ప్రయాణికులతో వెళ్తున్న ఆటో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో డ్రైవర్‌తో సహా ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి మార్కాపురం పట్టణంలోని దోర్నాల బస్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. పట్టణ పోలీసుల కథనం మేరకు.. మార్కాపురం పట్టణంలోని జగదీశ్వరి థియేటర్ ప్రాంతంలో నివాసముండే ఉప్పలదిన్నె గురవమ్మతోపాటు వారి బంధువులు సత్యనారాయణ, సునీత, శివకుమార్, విజయలక్ష్మి వ్యక్తిగత పనుల నిమిత్తం నంద్యాలకు వెళ్లి వస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మార్కాపురం రైల్వేస్టేషన్‌లో దిగారు. మార్కాపురం వచ్చేందుకు సత్యనారాయణకు చెందిన ఆటో ఎక్కారు. ఈ క్రమంలో దోర్నాల బస్టాండు సమీపంలోకి రాగానే ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రురాలు గురవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు తెలిపారు.



సహనం : వేలం ప్రక్రియ నిలిచిపోవడంతో బేళ్ల వద్ద వేచి ఉన్న రైతులు




ఆగ్రహం : మద్దతు ధర లేదని వేలం కేంద్రం అధికారులపై మండిపడుతున్న రైతులు

ధర కోసం మొర

మద్దతు ధర కల్పించాలని పొగాకు రైతులు గొంతు చించుకుంటున్నా వ్యాపారుల పంథాలో ఎలాంటి మార్పు కానరావడం లేదు. నాణ్యమైన పొగాకును సైతం తిరస్కరిస్తుండటంతో రైతుల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. గురువారం ఒంగోలులోని త్రోవగుంట వేలం కేంద్రంలో ఎఫ్-3 రకం బేళ్లకు వ్యాపారులు సరైన ధర ఇవ్వకపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియను అడ్డుకుని రైతులు నిరసన తెలిపారు. పలువురు రైతులు చేసేదేమీ లేక బేళ్లను ట్రాక్టర్లలో ఎత్తుకుని ఇంటిబాట పట్టారు.

– సాక్షి ఒంగోలు







నిర్వేదం : వ్యాపారుల తీరు, గిట్టుబాటు ధరపై చర్చలు.. ఆశగా ఎదురుచూపులు









అదనపు భారం : రిటర్న్ బేళ్లను ఇంటికి తీసుకెళ్లే క్రమంలో అవస్థలు పడుతున్న పొగాకు రైతులు

భజే.. భజే.. భక్తాభీష్టా..



వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

- 11 రోజులపాటు సాగే ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం
- ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా పొట్టేలు పందేలు, ఎడ్ల పోటీలు
- భక్తులను అలరించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సింగరాయకొండ:

పురాణ ప్రసిద్ధిగాంచిన, దక్షిణ సింహాచలంగా పేరొందిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం అంకురార్పణతో ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు 11 రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు, పాలక మండలి ఏర్పాటు చేస్తోంది.

బ్రహ్మోత్సవాలు ఇలా..

వేద పండితుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 8 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. శనివారం ఉదయం 10 గంటలకు ధ్వజారోహణ, రాత్రి 10 గంటలకు చంద్రప్రభ వాహనం, 8వ తేదీ ఉదయం 10 గంటలకు సూర్యప్రభ వాహనం, రాత్రి 10 గంటలకు హంసవాహనం, 9వ తేదీ సోమవారం రాత్రి 10 గంటలకు శేషవాహనం, 10వ తేదీ రాత్రి 10 గంటలకు హనుమంత సేవ, 11వ తేదీ ఉదయం 10 గంటలకు మోహినీ ఉత్సవం, రాత్రి 11 గంటలకు గరుడ సేవ, 12వ తేదీ రాత్రి 9 గంటలకు వసంతోత్సవం, 10 గంటలకు గజోత్సవం, 13వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం, 14వ తేదీ రాత్రి 10 గంటలకు గుర్రపు వాహనం, 15వ తేదీ ఉదయం 10 గంటలకు లక్ష్మీసంవాద ఉత్సవం, 11 గంటలకు చక్రస్నానం, రాత్రి 10 గంటలకు ధ్వజావరోహణ, పూర్ణాహుతి పూజలు, 16వ తేదీ సోమవారం రాత్రి 10 గంటలకు పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల సమయంలో రోజూ ఉదయం స్వామివారికి చప్పరసేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు.



యోగానంద లక్ష్మీనరసింహస్వామి | వరాహ లక్ష్మీనరసింహస్వామి

సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాల సందర్భంగా 10వ తేదీ నుంచి సత్యహరిశ్చంద్ర, చండీమేళం, కోలాట ప్రదర్శన, 11వ తేదీన పాటకచేరి, 12వ తేదీన కూచిపూడి నాట్య ప్రదర్శన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వీటితోపాటు శ్రీకృష్ణ యాదవ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో 9వ తేదీన పొట్టేళ్ల బలప్రదర్శన, 10వ తేదీన ఎడ్ల బండలాగుడు పోటీలు, 11వ తేదీన ఎడ్ల బండి రాధాడు పోటీలు నిర్వహించనున్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన వార్డు సభ్యుడు

● ఆహ్వానించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



వార్డు సభ్యుడు అనిల్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

పెద్దదోర్నాల: కూటమి ప్రభుత్వ విధానాలు నచ్చక పెద్దదోర్నాల మండలం నల్లగుంట్ల గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు పందీటి అనిల్ గురువారం యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీని వీడిన అనిల్‌కు యర్రగొండపాలెంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే తాటిపర్తి వైఎస్సార్ సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, మొద్దు తిరుపతిరావు, ఖైరబోయిన శ్రీను(గాంధీ), పార్టీ నాయకులు సీమోను, చిన్ని, వాదం శ్రీను, సంజీవమ్మ, కొట్టి రోజ్‌మేరీ పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు



నగర సంకీర్తనలో ఈఓ, అర్చకులు, బ్రాహ్మణ ఉభయదాతలు

పామూరు: మండల కేంద్రమైన పామూరులోని మదన వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రుక్మిణి, సత్యభామా సమేత మదన వేణుగోపాలస్వామి వారికి గురువారం రుత్విక్కులు నారాయణయం సత్యబాబు, గోపి పూజలు చేశారు. ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో నగర సంకీర్తన, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు ఈఓ దేవాదాయశాఖ తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. మొదటిరోజు బ్రాహ్మణ ఉభయం ఘనంగా నిర్వహించారు. వేద సభ నిర్వహించి ఎమ్మెల్యే ఉగ్ర దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ భీమానాయక్ పూజల్లో పాల్గొనగా స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు ఆకుమళ్ల చలపతిరావు, డాక్టర్ దీక్షితులు, నెల్లూరు నరసింహారావు, వితపు కుమార్, కొల్లూరు రవికిరణ్‌శర్మ, మహంకాళి శివప్రసాద్, జొన్నాబొట్ల గురునాథప్రసాద్, బండ్లా నారాయణ, గుర్రం వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

సత్తా చాటిన తెలంగాణ ఎడ్లు



విజేతకు ప్రథమ బహుమతి అందజేస్తున్న దాత, కమిటీ సభ్యులు

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రమైన సీఎస్‌పురంలో రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా గురువారం కాపునాయుళ్ల సంఘం ఆధ్వర్యంలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కు చెందిన ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. పోటీలను వైఎస్సార్ సీపీ నాయకుడు కదిరి ప్రకాశరావు, కాపు సంఘ నాయకులు ఆమంచి స్వాములు ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 10 జతల ఎడ్లు పాల్గొనగా హుజూర్‌నగర్‌కు చెందిన కేశవరెడ్డి, సురేందర్‌రెడ్డిల ఎడ్ల జత ప్రథమ స్థానం, వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరుకు చెందిన వెంకటేష్‌యాదవ్ ఎడ్ల జత ద్వితీయ స్థానం, అదే జిల్లా రంగసాయపల్లెకు చెందిన వెంకటసుబ్బారెడ్డి ఎడ్ల జత తృతీయ స్థానం, నంద్యాల జిల్లా రామసుబ్బారెడ్డి ఎడ్ల జత నాలుగో స్థానం, బాపట్ల జిల్లా పావులూరి వీరాస్వామి ఎడ్ల జత ఐదో స్థానం, నంద్యాల జిల్లా దినేష్‌రెడ్డి ఎడ్ల జత ఆరో స్థానం, అనంతపురం జిల్లా రామాంజనేయులు ఎడ్ల జత ఏడో స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.1,00,116 తులబందుల చలమయ్య నాయుడు, ద్వితీయ బహుమతి రూ.75,116ను మరాసుల రోశయ్య, తృతీయ బహుమతి రూ.50,116ను తిరుమలశెట్టి కిరణ్‌కుమార్, నాలుగో బహుమతి రూ.30,116ను ఆకుపాటి రమణయ్య, 5వ బహుమతి రూ.20,116ను మన్నేపల్లి వెంకటనరసయ్య, ఆరో బహుమతి రూ.15 వేలు బోయిన మాలకొండయ్య, ఏడో బహుమతి రూ.10 వేలను తోట అశోక్‌నాయుడు అందజేశారు.

దగా.. మో...సం!

● వివాహం పేరుతో యువకుడిని మోసగించిన కిలేడీలు
● రూ.లక్ష స్వాహా చేసిన ముగ్గురు మహిళలు



కురిచేడు: 'మంచి అమ్మాయి.. ఈడూ జోడు బాగుంటుందయ్యా..'అంటే గుడ్డిగా నమ్మాడు ఆ యువకుడు. బాజాభజంత్రీలు, పురోహితుడిని మాట్లాడుకున్నాడు. బంధుమిత్రులకు ఆహ్వానం పంపాడు. మొత్తం మీద పెళ్లి తంతుకు సకలం సిద్ధం చేసుకున్నాడు. చివరకు తాను మోసపోయానని తెలియగానే ఒక్కసారిగా కంగుతిన్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ముగ్గురు మహిళలు మ్యారేజ్ బ్యూరో పేరుతో కురిచేడు మండలంలోని కాటంవారిపల్లె గ్రామానికి చెందిన ఓ యువకుడిని సంప్రదించారు. పెళ్లి కావాల్సిన యువతులు ఉన్నారంటూ సంబంధం మాట్లాడారు. వివాహం కుదిరితే రూ.3 లక్షలు కమీషన్ ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం యువకుడిని విజయవాడ పిలిపించి అక్కడే యువతిని చూపించి నిశ్చితార్థం కూడా చేశారు. అడ్వాన్సుగా లక్ష రూపాయలు తీసుకున్నారు. మిగతా రూ.2 లక్షలు వివాహం కాగానే ఇవ్వాలని షరతు విధించారు. గురువారం రాత్రికి వివాహం జరగాల్సి ఉంది. బుధవారం రాత్రి ప్రదానం తీసుకుని కాటంవారిపల్లెకు చెందిన నలుగురు యువకులు విజయవాడ వెళ్లారు. వివాహం కుదుర్చుకున్న యువకుడు ఇచ్చిన చిరునామాలో ఎవరూ లేకపోవడంతో బిత్తరపోయారు. వారిని సంప్రదించేందుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. వివాహం కుదుర్చుకున్న యువకుడికి విషయం చేరవేశారు. గురువారం మధ్యాహ్నం వరకు వేచి చూసిన ఆ యువకులు నిరాశగా వెనుదిరిగారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలా వద్దా అనే మీమాంసలో ఉన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆంజనేయులు కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

ఒంగోలు టౌన్: ప్రార్థించే పెదవుల కంటే సాయపడే చేతులే గొప్పవని చాటారు జిల్లా ఫార్మసీ ఉద్యోగులు. నగరంలోని గద్దలగుంటకు చెందిన ఎ.ఆంజనేయులు నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఫార్మసి ఆఫీసర్‌గా పనిచేస్తూ కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మరణించారు. కాంట్రాక్ట్ ఉద్యోగి కావడంతో ఆయన కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు అందలేదు. ఈ క్రమంలో ఆంజనేయులు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రకాశం జిల్లా ఫార్మసి అసోసియేషన్ నిర్ణయించింది. అనుకున్నదే తడవుగా సంఘ సభ్యులందరూ కలిసి రూ.1.72 లక్షలు సేకరించారు. గురువారం గద్దలగుంటలోని ఆంజనేయులు నివాసంలో డీఎంహెచ్‌లో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు చెక్ అందజేశారు. ఆంజనేయులు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించేలా కలెక్టర్‌కు సిఫార్సు చేయాలని సంఘ సభ్యులు డీఎంహెచ్‌ఓకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జె.రవికిరణ్, కార్యదర్శి కె.రత్నాకర్‌బాబు, నాయకులు పి.సూర్య ప్రగతి, స్వర్ణ మంజరి, పద్మ, కృపాకుమారి తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు ఎంపీడీఓ సస్పెన్షన్

కురిచేడు: కురిచేడు ఎంపీడీఓ, ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న బి.సతీష్ బాబుపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. గతంలో బాపట్ల జిల్లా భట్టిప్రోలు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో నిధులు దుర్వినియోగం చేసినట్లు నిరూపణ కావడంతో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణ తేజ మంగళవారం సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు రాగా గురువారం ఎంపీడీఓ విధుల నుంచి వైదొలిగారు. కురిచేడు ఇన్‌చార్జి ఎంపీడీఓగా దొనకొండ ఎంపీడీఓ ఎం.శ్రీదేవిని నియమించారు.